



అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక
అనంతపురం శ్రీ సత్యసాయి
5
మంగళవారం 17 ఫిబ్రవరి 2026


# ఈ నెల 17వ తేదీన జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం

అనంతపురం, ఫిబ్రవరి 16 (అనంత ప్రభ )

ఈ నెల 17వ తేదీన నిర్వహించే జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం (నేషనల్ డీ వార్మింగ్ డే) నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అనంతరం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహణకు సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు మంచి ఆరోగ్యం కూడా చాలా అవసరం అని, విద్యార్థినీ విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉండడం కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 17, 24న చేపట్టిన జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమమును జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలన్నారు. జిల్లాలో 1 - 19 ఏళ్ల మధ్యనున్న 5,99,852 మంది చిన్నారులకి ఆల్బెండజోల్ మాత్రలను అందించాలన్నారు. జిల్లాలోని అంగన్వాడీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, బడి బయటి పిల్లలు, బడి బయట కౌమార దశలో పిల్లలు, ఐటిఐ, పాలిటెక్నిక్, ఒకేషనల్, నర్సింగ్, డిగ్రీ ప్రభుత్వ మరియు ప్రైవేటు సంస్థలు, సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలోని వారు అందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని, ఇందుకు అనుగుణంగా ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, డివిఈఓ, డిఎంహెచ్ఓ, తదితర సంబంధిత అధికారులను అప్రమత్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసే కార్యక్రమం ముందస్తుగా అందేలా చూడాలని, అలాగే జిల్లాలో ఈనెల 17వ తేదీన అన్ని పాఠశాలలు ఇంటర్మీడియట్ ఒకేషనల్ అంగన్వాడి తదితర కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలను పిల్లలకు భోజనం చేసిన తర్వాత 1-2 సం.లోపు పిల్లలకు చప్పరించే ఆల్బెండజోల్ 400 ఎం.జి మాత్రలో సగం, 2-19 సం. ల లోపు వారికి మింగించాలన్నారు.

పిల్లలు మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి రావాలంటే ఆరోగ్యం కూడా చాలా అవసరమన్నారు. నులిపురుగుల బారిన పడకుండా శారీరక, మానసిక ఆరోగ్యం, రోగ నిరోధక శక్తి పెంపొందాలన్నా పిల్లలు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. నులిపురుగులు పిల్లల ఎదుగుదల మీద తీవ్రమైన ప్రభావం చూపుతాయని, దీని వల్ల పోషకాహార లోపం ఏర్పడుతుందని, అంతేకాకుండా రక్తహీనత, ఆకలి లేకపోవడం, అలసట, కడుపునొప్పి, వికారం విరోచనాలు, బరువు తగ్గడం వంటి అనారోగ్య సమస్యలు ఏర్పడతాయన్నారు. ఇలాంటి పరిస్థితులను పిల్లలకు దూరం చేసి నులిపురుగులను నిర్మూలించి మంచి ఆరోగ్యంగా ఉండేందుకు అల్బెండజోల్ మాత్రలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. 2 సం.పైన నుండి 19 సంవత్సరాల పిల్లలు, కిశోర బాలలకు 400 ఎం.జి. మాత్రలు, 1 నుండి 2 సంవత్సరాల పిల్లలకు సగం మాత్ర అనగా 200 ఎం.జి ట్యాబ్లెట్ భోజనం చేసిన తరువాత చప్పరించి మింగేలా చర్యలు తీసుకోవాలని



తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా పిల్లలు, కిషోర బాలల కడుపులో నులి పురుగులు నిర్మూలించడానికి ఉచితంగా ఆల్బెండజోల్ 400 మిల్లీగ్రాముల చప్పరించే మాత్రలను సంబంధిత విద్యా సంస్థలకు ముందస్తుగా అందేలా చర్యలు తీసుకావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మాత్రలను అన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ అంగన్వాడీ కేంద్రాలకు, ప్రభుత్వ ప్రైవేట్ విద్యా సంస్థలు, కళాశాలలు, సంక్షేమ హాస్టళ్లు తదితర విద్యా సంస్థలకు ఉచితంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తద్వారా నులిపురుగుల సంక్రమణను సులభంగా నిర్మూలించ వచ్చునని పేర్కొన్నారు. 1-2 సం.ల పిల్లలకు సగం మాత్ర 200 ఎస్త్ర , 2 సం. పై బడి 19సం.ల పిల్లలకు 400ఎస్త్ర ఒక మాత్ర చప్పరిస్తూ మింగించాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య అధికారులు, మండల పరిధిలో మండల విద్యా శాఖాధికారులు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పర్యవేక్షించాలని, సంబంధిత శాఖల జిల్లా అధికారులు ఈ కార్యక్రమం పకడ్బందీగా జరిగేలా చూడాలని తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం రోజున ఏదేని కారణం చేత డీ-వార్మింగ్ చేయబడని పిల్లలకు మరలా ఫిబ్రవరి 24న మాప్ అప్ రోజున ఆల్బెండజోల్ మాత్రను చప్పరించి మింగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను, వైద్యశాఖ అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో డిఆర్ఓ మలోల, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.ఈబి.దేవి, ఐడిఎస్పీ నోడల్ ఆఫీసర్ డా.సురేంద్రరెడ్డి, ఆర్బీఎస్కే నోడల్ అధికారి డా.విష్ణుమూర్తి, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్బీఎస్కే రజిత, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ్ చంద్, నగర పాలక సంస్థ కమిషనర్ జశ్వంత్ రావు, డిఎంఓ ఓబులు, డిఈఓ ప్రసాద్ బాబు, ఇంటర్మీడియట్ కన్వీనర్, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటి మరియు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి యం.వెంకటరమణ నాయక్, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## ఎస్కేయూలో ఘనంగా కృష్ణదేవరాయల 555వ జయంతి ఉత్సవాలు




అనంతపురం, ఫిబ్రవరి 16 (అనంత ప్రభ )

శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో శ్రీ కృష్ణదేవరాయల 555వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య.యం.మునినారాయణప్ప గారు అధ్యక్షత వహించగా గౌరవ అతిథిగా విశ్వవిద్యాలయ కులఅమాత్యులు ఆచార్య.జి. వెంకట నాయుడు గారు,విశిష్ట అతిథిగా విశ్వవిద్యాలయ రిజిస్టర్ డాక్టర్.ఈ.రమేష్ బాబు గారు, కీలకోపన్యాసకర్తగా,చరిత్ర శాఖ ఆచార్యులు.కె.మల్లికార్జున రెడ్డి గారు హాజరై మాట్లాడారు.కులఅమాత్యులు ఆచార్య.జి. వెంకట నాయుడు గారు మాట్లాడుతూ శ్రీ కృష్ణదేవరాయలు అనేక రంగాలలో నైపుణ్యం సాధించి యుద్ధ రంగంలోనే కాకుండా సంగీత,సాహిత్య రంగాల్లో కూడా విశేష ప్రావీణ్యాన్ని సాధించి విజయనగర సామ్రాజ్యాన్ని సంగీత సాహిత్య సంపదలకు వారసత్వంగా నిలిపిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.తాను తులు భాషకు చెందిన వాడైనప్పటికీ కర్ణాటక రాజైన తెలుగు భాష కోసం విశేషమైన కృషి చేసిన వ్యక్తిగా మనకి కనిపిస్తారన్నారు.రిజిస్టర్ డాక్టర్.ఈ.రమేష్ బాబు గారు మాట్లాడుతూ విజయ నగర సామ్రాజ్యంలో అనేక చెరువులు త్రవించి నీటి పారుదల రంగానికి విశేష కృషి చేశారని,శ్రీ కృష్ణదేవరాయల జననం రాయలసీమ ప్రాంతానికే కాక,భారతదేశానికే తలమానికమన్నారు. కీలకోపన్యాస కర్తగా హాజరైన చరిత్ర శాఖ ఆచార్యులు కె.మల్లికా ర్జున రెడ్డి గారు మాట్లాడుతూ విజయనగర రాజులలో శ్రీ కృష్ణదేవరాయల గొప్పతనాన్ని సాంఘిక పరంగా,ఆర్థికపరంగా, సామాజికపరంగా అతను చేసినటువంటి అనేక మార్గదర్శకాలను సహేతుకంగా వివరించారు.ముఖ్యంగా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడం తద్వారా ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికై అనేక రకాల చెరువులను తవ్వించి అభివృద్ధి చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. విజయ నగర సామ్రాజ్యంను బాగా విస్తరించడంతో పాటు అన్ని రంగాలను అభివృద్ధి చేశారు.ముఖ్యంగా సాంస్కృతికపరంగా సామాజికపరంగా భాషల అభివృద్ధి పరంగా నేటి పాలకులు శ్రీ కృష్ణ దేవరాయలని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన నొక్కి చెప్పారు. సభాధ్యక్షులు ఆచార్య. యం.ముని నారాయణప్ప గారు మాట్లాడుతూ భాషల అభివృద్ధి కోసం శ్రీ కృష్ణదేవరాయలు ఎంతో కృషి చేశారని, పరభాష పరమత సహనాలకు నిలువెత్తు నిదర్శనం అని కొనియాడారు. జయంతి ఉత్సవ కార్యక్రమానికి కన్వీనర్ గా వ్యవహరించిన సామాజిక శాస్త్ర విభాగం సహాయాచార్యులు డాక్టర్.చాగంటి రామిరెడ్డి గారు మాట్లాడుతూ నేటి యువత శ్రీ కృష్ణ దేవరాయలను ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎవాల్యూయేషన్ ఆచార్య.జి.వి.రమణ గారు, మేనేజ్మెంట్ విభాగాదిపతి ఆచార్య.పి.మురళి గారు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య.సోమశేఖర్ గారు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య.రామచంద్ర గారు,ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్.లోకేష్ గారు,సూపరిండెంట్.డాక్టర్.చంద్ర బాబు గారు,డాక్టర్.కృష్ణుడు గారు, డాక్టర్.అనిత గారు ఫార్మసీ కళాశాల,ఇంజనీరింగ్ కళాశాల,వివిధ విభాగాల ఆచార్యులు, బోధనేతర ఉద్యోగులు,పరిశోధక విద్యార్థులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించిన పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్

- విజేయతలకు బహుమతులను ప్రధానం చేసిన ఎమ్మెల్యే
- క్యాంప్ కార్యాలయంలో మండలాధికారులతో సమావేశం
- తాగునీటి సమస్య, గ్రామాల్లో సమస్యలపై చర్చించిన ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ





ఆత్మకూరు, ఫిబ్రవరి 16 (అనంత ప్రభ)

ఆత్మకూరు మండలం బి.యాలేరు గ్రామంలో మహా శివరాత్రి సందర్భంగా పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దేశవాళి రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఎద్దులతో ఈ పోటీలకు తరలివచ్చారు. గ్రామంలో ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ పోటీలు సాగాయి. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన వారికి పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ముగింపు దశలో పోటీలను ఎమ్మెల్యే పరిటాల సునీత వీక్షించారు. ముందుగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే సునీతకు గ్రామస్థులు, రైతులు, టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. నాగ నందీశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పోటీలను వీక్షించారు. ఈ పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే సునీత చేతుల మీదుగా బహుమతుల ప్రదానం జరిగింది. మొదటి బహుమతి కర్నూలు జిల్లా జొన్నగిరి మండలంకి చెందిన అద్దంకి మస్తానీ యాదవ్ 30వేలు, 2వ బహుమతి విడపనకల్లు మండలం పెంచలపాడుకు చెందిన రాకెట్ల బీమ లింగప్పకు 25వేలు, 3వ బహుమతి బొమ్మనహాళ్ మండలం లింగదాలకు చెందిన ఎర్రి స్వామికి 20వేలు, 4వ బహుమతి బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాల్ కు చెందిన బసన్నకు 15వేలు, 5వ బహుమతి ఉరవకొండ మండలం కౌకుంట్లకు చెందిన గాలి సీనప్పకు 10వేలు, 6వ బహుమతి వజ్రకరూరు మండలం ధర్మపురికి చెందిన అజిత్ కుమార్ కు 8వేలు, 7వ బహుమతి కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పులికొండ గ్రామానికి చెందిన మాధవరాజుకు 5వేలు, 8వ బహుమతి ఆత్మకూరు మండలం బి.యాలేరుకు చెందిన నాగరాజుకు 3వేల రూపాయల చొప్పున ప్రదానం చేశారు. పోటీల్లో పాల్గొన్న దేశవాళి ఎద్దుల యజమానులకు సన్మానం చేసి రెండు రాగి గ్లాసులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి సాంప్రదాయ పోటీలు నిర్వహించడం వలన మంచి స్నేహపూర్వక వాతావరణం ఉంటుందన్నారు. ఇటీవల కాలంలో దేశవాళి పశువులు కనిపించకుండా పోతున్నాయని.. వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అలాగే పశువుల పెంపకాన్ని ప్రోత్సహించినట్టు అవుతుందన్నారు. ముఖ్యంగా దేశవాళి పశువుల వలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని.. ఇటీవల ఇతర జాతి పశువుల పెంపకం ఎక్కువగా చూస్తున్నామన్నారు. పాడి రైతులందర్నీ దేశవాళి ఆవుల పెంపకం చేపట్టేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె అన్నారు.వేసవి కాలం నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులను ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. గ్రామాల్లో ఎక్కడెక్కడ నీటి సమస్య ఉందని ఎమ్మెల్యే సునీత ఆరా తీశారు. రానున్న మూడు నెలల్లో ఎక్కడైన సమస్యలు వచ్చే అవకాశం ఉందా.. వస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశాల గురించి చర్చించారు. జల జీవన్ మిషన్ నిధులతో పీఏబిఆర్ నుంచి చేపట్టిన తాగునీటి పైప్ లైన్, ట్యాంకుల నిర్మాణాల పనులు ఎక్కడివరకు వచ్చాయన్నది వివరాలు అడిగారు. అనంతపురం రూరల్, ఆత్మకూరు మండలాల్లో నెలకొన్న తాగునీటి సమస్య గురించి అసెంబ్లీలో ప్రస్తావించామన్నారు. జల్ జీవన్ మిషన్ కింద చేసిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరామన్నారు. ఇందుకు సంబంధించిన మంత్రిని కూడా కలిసి నివేదిస్తామన్నారు. త్వరలోనే ఈ నిధులు వచ్చే అవకాశం ఉందని.. ఈ పనులు పూర్తి చేస్తే రెండు మండలాల్లో దాదాపు నీటి సమస్య ఉండదన్నారు. ఇవి కాకుండా ఇంకా ఏ గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంది.. ఎక్కడైనా నిధులు అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వెంటనే ప్రభుత్వంతో మాట్లాడి నిధులు తీసుకొస్తామన్నారు. దీనిపై ఎక్కడా నిర్లక్ష్యం వహించవద్దన్నారు. అలాగే గ్రామాల వారిగా ఏమైనా పనులు పెండింగ్ లో ఉన్నాయా అన్నది కూడా ఒక నివేదిక సిద్ధం చేయాలన్నారు. ఇప్పటికే జరుగుతున్న సిసి రోడ్ల పనుల గురించి ఎంపీడీఓలనడిగి వివరాలు తెలుసుకున్నారు. నిర్దేశించిన గడువులోగా ఆ పనులు పూర్తి కావాలని ఆదేశించారు.

## ఘనంగా సిద్ధేశ్వర స్వామి రథోత్సవం

ఉరవకొండ, ఫిబ్రవరి 16 (అనంత ప్రభ)

ఉరవకొండ మండలంలోని పెద్ద ముస్తూర్ గ్రామంలో వెలసిన శ్రీ సిద్ధేశ్వర స్వామి రథోత్సవం సోమవారం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా నిర్వహించే ఈ రథోత్సవం ఈసారి మరింత వైభవంగా సాగి గ్రామమంతా పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

రథోత్సవం సందర్భంగా స్వామివారిని వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించగా భక్తులు స్వామివారి దర్శనానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు నరేంద్ర ఆధ్వర్యంలో రథోత్సవ పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించడంతో భక్తులు విశేషంగా ఆకట్టుకున్నారు.

ఈ వేడుకను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు చేయించుకొని, అభిషేకాలు



నిర్వహించి తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. స్వామివారి రథం గ్రామ వీధుల గుండా సాగుతుండగా భక్తులు హరహర మహాదేవ అంటూ జయఘోషలు చేస్తూ ఊరేగింపును కనుల పండువగా వీక్షించారు.

ఈ కార్యక్రమాన్ని ఆలయ ఈవో కృష్ణయ్య ఆధ్వర్యంలో సజావుగా నిర్వహించారు. రథోత్సవ ఏర్పాట్లలో గ్రామ పెద్దలు, యువకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.


ఈ కార్యక్రమంలో నెట్టెం ప్రసాద్, నెట్టెం బోస్, వేణుగోపాలు, జగన్నాథ్, ప్రశాంత్, నాగరాజు, టిడిపి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు

## 19 న జిల్లా కోర్టు ఉద్యోగాల రాత పరీక్షలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ. భీమారావు

అనంత, ఫిబ్రవరి 16 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థలో ఉద్యోగాల భర్తీ కోసం వ్రాత పరీక్షలు అనంతపురం రుద్రంపేట పరిధిలోని శ్రీ బాలాజీ పీజీ కాలేజ్ పీవీకేకే ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణ నందు ఈనెల 19 తేదీన జరుగుతాయని ఉద్యోగార్తులు తమ తమ హాల్ టికెట్లు మరియు కావలసిన వస్తువులతో పాటు గంట ముందుగానే హాజరుకావాలని అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షులు ఈ భీమారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్రంట్ ఆఫీస్ కోఆర్డినేటర్ పోస్ట్ కొరకు 12 గంటల 30 నిమిషాల నుండి వ్రాత పరీక్ష ప్రారంభమగునని కాలవ్యవధి 90 నిమిషములని మరియు రికార్డ్ అసిస్టెంట్ వ్రాత పరీక్ష 3 గంటల 30 నిమిషములకు ప్రారంభమగునని కాలవ్యవధి 90 నిమిషములని తెలియజేశారు.

అలాగే డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు



జరగవలసిన రాత పరీక్ష హైకోర్టు వారి ఉత్తర్వుల మేరకు నిలుపుదల చేయడమైనదని తదుపరి తేదీ హైకోర్టు ఆదేశాలు స్వీకరించిన పిమ్మట తెలియజేస్తామని జడ్జి తెలిపారు. అర్హులైన వారి పేర్లు జిల్లా కోర్టు వెబ్సైట్ నందు పొందుపరచడమైనదని ఎవరేమి అర్హులైన వారికి హాల్ టికెట్లు రాని ఎడల అనతపురము జిల్లా న్యాయ సేవా అధికార సంస్థకు ముందుగానే సంప్రదించగలరని తెలియజేయడమైనదని అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షులు ఈ భీమారావు ఒక ప్రకటనలో తెలిపారు

AP 4PG 17 - 2- 2026 TUESDAY qxp_Layout 1 16-02-2026 10:28 PM Page 2



## యాడికిలో ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలు




యాడికి, ఫిబ్రవరి 16 (అనంత ప్రభ )

యాడికి మండల కేంద్రంలో శ్రీకృష్ణదేవరాయల 555వ జయంతి వేడుకలు సోమవారం యాడికి మండల బలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కూడలిలోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి బలిజ కులస్తులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా యాడికి ఉప సర్పంచ్ కాసా చంద్రమోహన్ మాట్లాడుతూ విజ్ఞానం, కళలు, సాహిత్యం, ప్రజా సంక్షేమంలో శ్రీకృష్ణదేవరాయలు చేసిన సేవలు భారత చరిత్రలో చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజల అభివృద్ధికి అనేక నీటి పారుదల, దేవాలయ నిర్మాణాలు చేపట్టి సామ్రాజ్యాన్ని సుభిక్షంగా తీర్చిదిద్దిన మహారాజుగా ఆయన నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యాడికి బలిజ సంఘం అధ్యక్షుడు బండారు హరినాథ్ బాబు, కల్లమడి నారాయణస్వామి, కోడి వెంకటరాముడు, పొట్టే గంగాధర్, పొంతల కిట్టయ్య, రాయుడు, పోలిశెట్టి రామంజి, బెల్దార్ కిట్టు, గంజి జగదీష్ తదితరులు పాల్గొన్నారు

## చుక్కలూరు పిహెచ్సీ ల్యాబ్ పరిశీలన



యాడికి, ఫిబ్రవరి 16 (అనంత ప్రభ)

జిల్లా మలేరియా అధికారి డి ఓబులు ఆదేశాల మేరకు చుక్కలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లావణ్య, డాక్టర్ కేశవానంద ఆధ్వర్యంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు పరిశీలించారు. ల్యాబ్ రికార్డులు పరిశీలించి, జ్వరంతో వచ్చే ప్రతి రోగికి డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా, టైఫాయిడ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో నెలకు 40 రక్త పూతలు సేకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేల్ సూపర్వైజర్ ఎంపీ నారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ నాగజ్యోతి నాగజ్యోతి, మేల్ హెల్త్ అసిస్టెంట్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు

## శ్రీ ఎంజేరు సిద్ధేశ్వర స్వామి ఆలయం పూజలు పాల్గొన్న జడ్పీటీసీ గుడిబండ భూతరాజు



గుడిబండ, ఫిబ్రవరి 16 (అనంత ప్రభ )

హేమావతి గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా శ్రీ ఎంజేరు సిద్దేశ్వర స్వామి ఆలయం పూజలు పాల్గొని జడ్పీటీసీ గుడిబండ భూతరాజు గారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## హాలుకూరులో టిడిపికి బిగ్ షాక్



మడకశిర, ఫిబ్రవరి 16 (అనంత ప్రభ )

శ్రీ సత్య సాయి జిల్లా మడకశిర నియోజకవర్గం అమరాపురంమండల్ హాలుకూరు పంచాయతీలో కరుడుగట్టిన టిడిపి యువ నాయకుడు గుండమ్మ గారి దివాకర్ వాల్మీకి కుటుంబం హాలుకూరు కాంత్ రాజన్న సమక్షంలో వైసీపీలో కి చేరడం జరిగినది

## ఘనంగా శివపార్వతుల కళ్యాణం



యాడి,కి ఫిబ్రవరి 16 (అనంత ప్రభ)

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని యాడికి మండలంలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రంలోని శ్రీ భోగలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు దినేష్, నీలి శశిధర్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ బొంబాయి రమేష్ నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు గొర్తి రుద్రమనాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సహకారంతో కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం ఆలయ ప్రాంగణంలో బొంబాయి రమేష్ నాయుడు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు భోజన సదుపాయం కల్పించారు. అలాగే మండల కేంద్రంలోని కొండపై వెలసిన శ్రీ విజయాంబికా సమేత భైరవలింగేశ్వర స్వామి ఆలయంలో కూడా శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పామిశెట్టి రఘురాముడు, దాసరి కృష్ణ, శంకరాచారి, పామిశెట్టి శ్రీరాములు తదితరులు మరియు గ్రామ ప్రజలు భక్తుల సహకారంతో కార్యక్రమం విజయవంతమైంది. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

మండల కేంద్రంలోని హైస్కూల్ గ్రౌండ్ వెనుక గల భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయంలో, అలాగే లాలెప్ప కాలనీ సమీపంలోని శ్రీ నాగలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు

## వైభవంగా శ్రీ కోనరామలింగేశ్వర స్వామి రథోత్సవం



యాడికి, ఫిబ్రవరి 16 (అనంత ప్రభ)

యాడికి మండలం కోన సమీపంలో గల శ్రీ కోన రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, స్వామివారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుండి స్వామివారికి వివిధ అభిషేకాలు, అలంకార పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణలతో వైభవంగా జరిపించారు. గ్రామ పెద్దలు, భక్తులు, గ్రామ ప్రజల సహకారంతో స్వామివారి రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. రథోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రథోత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యాడికి సీఐ శ్రీనివాసులు తన సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి భద్రతా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో క్లాస్ వన్ కాంట్రాక్టర్ చవ్వా గోపాల్ రెడ్డి, టిడిపి నాయకులు మార్కే రామాంజనేయులు, రామకృష్ణ, బద్దెల రాముడు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ఘనంగా వేలూరు రంగయ్య జన్మదిన వేడుకలు








యాడికి, ఫిబ్రవరి 16 (అనంత ప్రభ )

టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య జన్మదిన వేడుకలను యాడికి మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో మరియు రాయలచెరువు గ్రామంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి వేలూరు రంగయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు మాట్లాడుతూ వేలూరు రంగయ్య ప్రజాసేవను ప్రశంసిస్తూ టిడిపి బలోపేతానికి ఆయన చేస-్తున్న సేవలను కొనియాడుతూ, రాజకీయ జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రుద్రమ నాయుడు, పరిమి చరణ్, మాదాల అనిల్, విశ్వనాథ్, దడియాల ఆది, తిరంపురం నీలకంఠ, వెలిగండ్ల ఆదినారాయణ, జల్లా గంగిరెడ్డి, మదమంచి శివ, మేస్త్రి చంద్ర , కోడూరు నీలకంఠరెడ్డి, రహంతుల్లా, హాజీ, పలువురు టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు

## అమున్సిపల్ కమిషనర్ను మర్యాదపూర్వకంగా కలిసిన పరిగెల నారాయణ వెంకటేష్




ఆదోని, ఫిబ్రవరి 16 (అనంత ప్రభ)

ఈరోజు మున్సిపల్ కమిషనర్ సి.ఎం.ఏ నయీామ్ అహ్మద్ను వైఎస్ఆర్సిపి సీనియర్ ప్రచార అధ్యక్షుడు పరిగెల నారాయణ వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నగర అభివృద్ధి, ప్రజా సమస్యలు, మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న పనులపై చర్చించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మున్సిపల్ శాఖతో సమన్వయం కొనసాగుతుందని ఆయన తెలిపారు

## మహా శివరాత్రి వేడుకల్లో శ్రీ పంచలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా



ఆలూరు, ఫిబ్రవరి 16 (అనంత ప్రభ)

ఆలూరు నియోజకవర్గం ఆస్పరి మండలం బినిగేరి గ్రామంలో మహా శివరాత్రి సందర్భంగా కొండపై వెలసిన శ్రీ పంచలింగేశ్వర స్వామి దేవ-స్థానంలో శ్రీ కామేశ్వరి పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి, వారి సతీమణి బుసినే రామాంజినమ్మ హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే దంపతులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, బీవీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు

## బెనిగేరి గ్రామంలో భక్తిశ్రద్ధల మధ్య శ్రీగిరి పంచాలింగేశ్వర స్వామి దర్శనం




ఆదోని, ఫిబ్రవరి 16 (అనంత ప్రభ)

బెనిగేరి గ్రామంలో గ్రామస్తుల పిలుపుమేరకు టిడిపి జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ శ్రీగిరి పంచాలింగేశ్వర స్వామిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని దేవదేవుని ఆశీస్సులు అందరిపైనా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని, భక్తుల జైజయధ్వానాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

ఈ కార్యక్రమంలో సద్గురు శ్రీనివాస్ నాయన, బెనిగేరి గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ ప్రజల ఐక్యత, భక్తి భావం ప్రతిబింబించిన ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.

--- భక్తి, ఐక్యత, ఆధ్యాత్మికత కలిసిన వేడుకగా కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది

## ఆదోనిలో అన్న కాన్టీన్లకు పాలక మండలి నియామకం



ఆదోని, ఫిబ్రవరి 16 (అనంత ప్రభ)

ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని మూడు అన్న కాన్టీన్ల నిర్వహణకు పాలక మండలి నియామకాలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన భోజనం అందించాలనే లక్ష్యంతో ఈ కాన్టీన్లను మరింత సమర్థవంతంగా నడిపించేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

పాలక మండలి సభ్యులుగా స్థానికంగా సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న వ్యక్తులను ఎంపిక చేసినట్లు తెలిపారు. నియమితులైన సభ్యులు కాన్టీన్లలో శుభ్రత, ఆహార నాణ్యత, సమయపాలన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు.

ప్రస్తుతం ఆదోనిలో నిర్వహిస్తున్న అన్న కాన్టీన్లు పేద, నిరుపేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని, రోజువారీ కార్మికులు, వృద్ధులు, ప్రయాణికులు పెద్ద సంఖ్యలో లబ్ధి పొందుతున్నారని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవలను విస్తరించే దిశగా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు వెల్లడించారు.

ఈ నియామకాలపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వానికి మరియు మున్సిపల్ యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.

# బాల్య వివాహలను వ్యతిరేకిద్దాం..! భవిష్యత్తును కాపాడుదాం...!

- బాల్య వివాహాలతో జీవితం అంధకారం
- బాల్యం వివాహాలకు తల్లిదండ్రులు అడ్డుకట్టు వేయాలి
- చిన్న వయసులో పెళ్లిళ్లకు ప్రేరేపించే వారిపై చర్యలు తప్పవు



కూడేరు, ఫిబ్రవరి 16 (అనంత ప్రభ)

కూడేరు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ ప్రాంగణంలో సోమవారం రోజున గ్రామ సర్పంచ్ మీనుగ లలితమ్మ అధ్యక్షతన ఐసిడిఎస్ ఉరవకొండ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ బి.ఎన్ శ్రీదేవి, మండల విద్యాధికారి-1 మహమ్మద్ గౌస్, ఏఎస్ఐ సంజీవులు, సూపర్వైజర్ సురేఖమ్మ వారి సిబ్బంది మరియు చిన్నపిల్లల తల్లిదండ్రులు తో కలిసి బాల్య వివాహల నియంత్రణకు 100 రోజులు జాతీయ ప్రచార కార్యక్రమాల పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ,ఐసిడిఎస్ ఉరవకొండ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ బి.ఎన్.శ్రీదేవి మాట్లాడుతూ సమాజంలో బాల్య వివాహాల నియంత్రణ కు అడ్డుకట్టు వేయకపోతే చిన్న పిల్లల యొక్క జీవితం అంధకారంలో పడే ప్రమాదం పొంచి ఉందని సమాజంలో ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా బాల్య వివాహాలకు అడ్డుకట్టు వేయడానికి ప్రయత్నించాలని చిన్న పిల్లలు తెలియని వయసులో (ఆత్రుతతో) బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే అనర్థాలు గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని చిన్న వయసులో పెళ్లిళ్లు చేసుకోరాదని చైల్డ్ మ్యారేజ్ లను ఎవరు కూడా ప్రోత్సహించరాదని బాల్య వివాహలను అరికట్టడానికి అంతా సమిష్టిగా కృషి చేయాలని అప్పుడే చిన్నపిల్లల యొక్క భవిష్యత్తుకు బంగారు బాటలు వేయగలమని ఆమె అన్నారు. ఇటీవల కొందరు సామాజిక మాధ్యమాలకు బానిసై మరియు వాట్సప్ ద్వారా పరిచయాలతో మొదలై..... ఆ....పరిచయం కాస్త ఆకర్షణగా మరి ఎదుటివారి వ్యక్తిత్వాన్ని, తారాస్థాయికి ప్రేరేపిస్తూ విడిపోని బంధంగా మార్చి... ఎదుట వ్యక్తుల మంచితనం సానిహిత్యాన్ని ఆసరాగా చేసుకుని చాకచక్యమైన మాయమాటలుతో దగ్గరై ఎదుటి వ్యక్తి బలహీనతను లక్ష్యం చేసుకుని మోసగిస్తూ శారీరిక సంబంధాలతో బలపడి విడిపోని బంధంగా మార్చడం, ఇవన్నీ పూర్తిగా తెలిసొచ్చే లోపే జరిగే అన్యాయాలు జరిగిపోవడంతో ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో జీవితం అంధకారంగా మారిపోతుందని టీనేజ్ ప్రెగ్నెన్సీ భవిష్యత్తును అంధకారంగా మార్చేస్తుందని ఆడపిల్లల ప్రతి ఒక్కరు మోసపూరిత వ్యక్తుల పట్ల , ఆకుతాయి వ్యక్తుల పట్ల అప్రమత్తంగా జాగ్రత్తగా ఉండాలని సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంచుకోవాలని పిల్లలు చిన్న వయసు లో తొందరపడి పెళ్లిళ్ల చేసుకోరాదని విద్యను అభ్యసించే వయసులో కెరీయర్ పై దృష్టి సాధించాలని ఆడపిల్లలకు 19 సంవత్సరాల నుండి తర్వాత మగ పిల్లలు అయితే 24 సంవత్సరాల తర్వాత పెళ్లి చేసుకోవడం సురక్షితమని వారన్నారు. చిన్న వయసులో పెళ్లిళ్లకు తల్లిదండ్రులు గాని మరి వారు ఎంతటి వారైనా ప్రేరేపిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఐసిడిఎస్ ఊరుకొండ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ బి.ఆర్ శ్రీదేవి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లలితమ్మ , ఉరవకొండ ప్రా-జెక్టు డైరెక్టర్ సిడిపిఓ డాక్టర్ బి.ఎన్ శ్రీదేవి, మండల విద్యాధికారి-1 మహమ్మద్ గౌస్, ఏఎస్ఐ సంజీవులు, వీఆర్వో, మహిళా సంరక్షకురాలు, అంగన్వాడీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

# జర్నలిస్టులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ
## ఈనెల 19వ తారీకు లోపు పేర్లు నమోదు చేసుకోవాలి

అనంతపురం, ఫిబ్రవరి 16 (అనంత ప్రభ ) అనంతపురం జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులందరికీ టు వీలర్ వాహనం కలిగి ఉన్న వారందరికీ ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేయడం జరుగుతుందని ఏపీ జర్నలిస్ట్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మచ్చా రామలింగారెడ్డి తెలిపారు

జిల్లా ఎస్పీ పి జగదీష్ ఇటీవల జిల్లాలో తీసుకున్న అద్భుత నిర్ణయం నో హెల్మెట్ నో పెట్రోల్ కార్యక్రమానికి మద్దతుగా ఎస్పీ మాటలకు అనుగుణంగా జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులందరికీ హెల్మెట్లు ధరించే విధంగా చూడాలన్న లక్ష్యంతో జర్నలిస్టులు ఎవరు రోడ్డు ప్రమాదానికి గురికాకుండా ఉండాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని తీసుకున్నామని మచ్చా రామలింగారెడ్డి తెలిపారు

జర్నలిస్టుల సంక్షేమం కోసం ఈ కార్యక్రమాన్నిఏపీ జర్నలిస్టు డెవలప్మెంట్ సొసైటీ ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ సంయుక్తంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లాలోని ప్రతి జర్నలిస్టు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మచ్చా రామలింగారెడ్డి కోరారు

అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాల్లో రాప్తాడు, శింగనమల, తాడిపత్రి, రాయదుర్గం, కళ్యాణ్ దుర్గం, గుంతకల్, గుత్తి, ఉరవకొండ మండల రిపోర్టర్లు తదితర నియోజకవర్గాల్లో ఉన్నటువంటి పత్రికలు ఎలక్ట్రానిక్ మీడియా



కెమెరామెన్లు, ఫోటోగ్రాఫర్లు, సబ్ ఎడిటర్లు, ప్రింట్ మీడియా, చిన్న పత్రికలు యూట్యూబ్ ఛానల్స్ , సీనియర్ జర్నలిస్టులు, వెటర్న్ జర్నలిస్టులు అందరూవర్కింగ్ జర్నలిస్టులు అందరూ హెల్మెట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని మచ్చా రామలింగారెడ్డి అన్నారు

ఈనెల19 తారీకు సాయంత్రం ఐదు గంటల లోపు వారి పేర్లు అనంతపురం నగరంలోని అంకుశం పత్రిక కార్యాలయం సప్తగిరి సర్కిల్ వద్దగాని లేదా అనంతపురం నగరంలోని ప్రెస్ క్లబ్ లో వారి పేర్లను నమోదు చేసుకుని వచ్చునని మచ్చా రామలింగారెడ్డి అన్నారు

జిల్లా వ్యాప్తంగా పేర్లు నమోదు చేసుకున్న వారికి మాత్రమే ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లాలోని ప్రతి ఒక్క వర్కింగ్ జర్నలిస్టు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వారి పేర్లను నమోదు చేసుకుని హెల్మెట్ తీసుకోవాల్సిందిగా మచ్చా రామలింగారెడ్డి కోరారు

పేర్లు నమోదు చేసుకున్న వర్కింగ్ జర్నలిస్టుల కు మాత్రమే హెల్మెట్లు ఇవ్వడం జరుగుతుంది గమనించగలరు

హెల్మెట్ కావాలన్నా వారు నమోదు చేసుకోవాల్సిన వారు ఈ నెంబర్లకి ఫోన్ చేసి వారి వివరాలను నమోదు చేసుకోగలరు ఆధార్ కార్డు మీడియా కార్డు జిరాక్స్ కాపీ అందజేయగలరు

మచ్చా రామలింగారెడ్డి
చీఫ్ ఎడిటర్ వీ==6ళిజ,
అంకుశం పత్రిక
9849152149
7386958666

ఎస్ వెంకటేశ్వర్లు
రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ
సెల్ ఫోన్ నెంబర్ 95336 33213

డి రాజగోపాల్
సీనియర్ జర్నలిస్ట్
సెల్ ఫోన్ నెంబర్
9705444590

ఖ విజయ్ రాజు
సెక్రెటరీ జర్నలిస్టు డెవలప్మెంట్ సొసైటీ
కొడిమి జర్నలిస్ట్ కాలనీ
9490062555
ఏపీ జర్నలిస్టు డెవలప్మెంట్ సొసైటీ ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్

# శివరాత్రి పర్వదినాన శింగనమలలో అంగరంగ వైభవంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం
## -- భక్తులతో కిటకిటలాడిన శివాలయం

శింగనమల, ఫిబ్రవరి 16 (అనంత ప్రభ)
అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం, శింగనమల మండల కేంద్రంలోని శివాలయంలో మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం భక్తి శ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించబడింది.

వేద మంత్రోచ్చారణల నడుమ సంప్రదాయబద్ధంగా స్వామివారి కళ్యాణం జరగగా, ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.

ఈ కళ్యాణ మహోత్సవానికి తన స్వగ్రామంలో స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ తల్లిదండ్రులు బండారు లీలావతి బండారు రవికుమార్ హాజరై ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

శింగనమల మార్కెట్ యార్డు ఛైర్మేన్ దండు శ్రీనివాసులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

శివాలయంనకు రాష్ట్ర పంచాయితీ రాజ్ ఛాంబర్ కార్య నిర్వహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి డెకరేషన్ లైటింగ్ డెకరేషన్ చేయించడం జరిగింది.

టిడిపి మండల కన్వీనర్ గోరంట్ల మారుతీ నాయుడు ఆధ్వర్యంలో కట్టెల కోలన్న కార్యక్రమం నిర్వహించారు.

గ్రామ ప్రజలు, మహిళలు, యువత, నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. భజనలు, మంగళవాయిద్యాలు, సంప్రదాయ కార్యక్రమాలతో



కళ్యాణోత్సవం మరింత వైభవంగా సాగింది.

ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్ ,పంచాయితీ కార్యదర్శి తిప్పేస్వామి, రాష్ట్ర నాయిబ్రాహ్మణ డైరెక్టర్ యం.ఆదినారాయణ, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి అనిల్ కుమార్ యాదవ్, చెరువు ఆయకట్టు ఛైర్మేన్ బోయ సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ వెంకటేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు వీరాంజనేయులు, బోయ సురేష్, నాయకులు పట్నం నాగేష్ , బెస్త నారాయణ స్వామి, గాండ్ల బాలరాజు, నాగలింగం, రమేష్ , గుర్రప్ప, మాజీ ఎంపీటీసీ మునేంద్ర, రాజబాబు, శంకర్ నారాయణ, బోయ సుధాకర్ , ధనుంజయ్య, కాయల సురేష్ యాదవ్, మహేష్ యాదవ్, యాదవ్ , బండి వెంకట నారాయణ, డీలరు, మసూద్ వలి, ఐటిడిపి ముని, శివశంకర్ యాదవ్, కమిటి సభ్యులు రఘురామ, గంజికుంట మధు, తాటపి రవి, జెల్లి శ్రీనివాసులు, బండారు కుటుంబ సభ్యులు, టిడిపి సీనియర్ నాయకులు, పలువురు గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.







## సమ్మర్‌లో ఈ కోల్డ్ కాఫీలతో బరువు తగ్గడం ఖాయం..



కాఫీ.. ఉదయాన్నే ఇది గొంతులో పడనిదే చాలా మందికి చాలా పనులు అవ్వవు. అంతలా దీనికి అడిక్ట్ అయిపోతారు. ఓ రకంగా ఇది స్ట్రెస్ బస్టర్ చాలా మందికి. దీనిని తాగడం వల్ల చాలా లాభాలు ఉన్నాయి. అయితే, ఏదైనా ఎప్పుడు, ఎలా, ఎంత తీసుకోవాలో అలానే చేయాలి. లేకపోతే రిజల్ట్స్ తేడా కొడతాయి. ఇప్పుడు ఈ సమ్మర్‌లో నార్మల్ కాఫీ కాకుండా, వెయిట్ తగ్గించే వెయిట్ లాస్ గురించి తెలుసుకుందాం.

కోల్డ్ కాఫీ..

ఈ కాఫీని కొద్ది మంది ఇష్టపడతారు. అయితే, సమ్మర్‌లో వేడిని తగ్గించి రిఫ్రెష్‌గా ఫీల్ అయ్యేందుకు కాఫీ లవర్స్ నార్మల్ కాఫీ బదులు దీనికి షిఫ్ట్ అవుతారు. దీనిని తాగడం వల్ల ఓ మైనస్ పాయింట్ ఏంటంటే.. ఇది క్యాలరీలను అమాంతం పెంచుతుంది. అయితే, అలా కాకుండా ఈ రుచిని ఆస్వాదిస్తూనే.. బరువు తగ్గాలంటే కొన్ని స్పెషల్ కాఫీల గురించి మీరు తెలుసుకోవాల్సిందే.

కోల్డ్ బ్రూయింగ్..

ఈ కాఫీ గింజలను గది ఉష్ణోగ్రత కంటే తక్కువగా ఉన్న నీటిలో 20 గంటల కంటే ఎక్కువసేపు ఉంచి తయారు చేస్తారు. దీనిని ఇంట్లోనే ఈజీగా ఎలా చేయాలంటే మీరు చేయాల్సిదిల్లా 1:12 నిష్పత్తితో రాత్రి నీటిలో కాఫీ గింజలను ఉంచి వాటిని మిక్సీ పట్టండి. దీనిని మీరు ఓ కేజి వరకూ చేసుకుని ఫ్రిజ్‌లో కూడా పెట్టుకోవచ్చు. దీనిని తీసుకుని కాఫీలా చేసుకుని పాలు లేకుండా. తీపి కోసం షుగర్, బెల్లం పొడి, తేనె వేసుకోవచ్చు. అయితే లేకుండా తాగితే బెటర్. ఒక వేళ తాగలేమనుకుంటే కాస్తా తక్కువ పరిమాణంలో షుగర్ ఆల్టర్నేటివ్స్ వేసి కొద్దిగా నిమ్మరసం వేసుకుని తాగండి. దీని వల్ల బరువు తగ్గుతారు.




దాల్చిన చెక్క కాఫీ..

దాల్చిన చెక్కలో ఎన్నో గుణాలు ఉన్నాయి. అవి బరువుని ఈజీగా తగ్గిస్తాయి. కప్పు బ్లాక్ కాఫీకి ఎస్ప్రెస్సో షాట్, చిటికెడు దాల్చిన చెక్క పొడి కలపండి. దీని వల్ల ఫ్యాట్‌ని కరిగించే కాఫీని తయారు చేసుకోవచ్చు. దీని వల్ల మెటబాలిజం పెరుగుతుంది. దాల్చిన చెక్కలోని యాంటీ ఆక్సిడెట్స్ కెఫిన్‌తో కలిసి బరువు తగ్గించడాన్ని స్పీడ్‌గా చేస్తుంది.



# వేసవిలో రాగి జావ తాగితే ఎనర్జీతో పాటు ఆరోగ్యం కూడా



వేసవికాలంలో త్వరగా నీరసించిపోతారు. ఎండలో కాసేపు అలా వెళ్లివచ్చారంటే ఎనర్జీ అంతా కోల్పోయి నీరసంగా మారిపోతారు. అలాగే ఎండాకాలంలో ఏమీ తినాలనిపించదు. ఎక్కువగా దాహం వేస్తూ ఉంటుంది. అలా అని ఏదీ తినకుండా ఉంటే త్వరగా నీరసించిపోతాం. ఎండాకాలంలో డీహైడ్రేషన్ కు గురికావడం, వడదెబ్బ బారిన పడటం ఎక్కువగా జరుగుతుంది. వేసవికాలంలో ఉదయం తీసుకునే ఆహారం రోజంతా హుషారుగా పని చేయడానికి కావాల్సిన శక్తిని అందించేలా ఉండాలి. అందుకే వేసవి కాలంలో రాగి జావ తాగాలని న్యూట్రిషనిస్టులు సూచిస్తుంటారు. దీని వల్ల తక్షణ శక్తి రావడంతో పాటు, రోగనిరోధక శక్తి మెరుగుపడటం, శరీరానికి కావాల్సిన పోషకాలను అందిస్తుంది.

కాల్షియం సమృద్ధిగా ఉంటుంది: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ స్టడీస్ ప్రకారం, ఇతర మిల్లెట్లు ధాన్యాలతో పోలిస్తే రాగుల్లో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. పాలు కాకుండా కాల్షియం ఎక్కువగా ఉండేది రాగుల్లోనే. డయాబెటిస్ నియంత్రణలో సహాయపడుతుంది: గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల ఆకలి తక్కువగా వేస్తుంది. జీర్ణక్రియ వేగాన్ని మెయింటైన్ చేస్తుంది. రక్తంలో చక్కెర పరిధిని నియంత్రణలో ఉంచుంతుంది. రక్తహీనతతో పోరు: రాగుల్లో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. రక్తహీనత ఉన్న వారు, తక్కువ హిమోగ్లోబిన్ స్థాయిలు ఉన్న వారికి రాగి జావ ఒక వరం లాంటిది. ఇందులోని ఐరన్ రక్తహీనతను తగ్గిస్తుంది.

బరువు తగ్గడంలో సహాయం: రాగుల్లో అధిక మొత్తంలో ఉండే డైటరీ ఫైబర్ పొట్టను ఎక్కువసేపు నిండుగా ఉంచుతుంది. దీని వల్ల ఆకలి తగ్గుతుంది. ఇలా బరువు తగ్గడానికి దారితీస్తుంది. చర్మం సంరక్షణ: రాగుల్లో ఉండే మెథియోనిన్, లైసిన్ వంటి కీలక అమైనో ఆమ్లాలు చర్మ కణజాలాన్ని కాపాడతాయి. చర్మం ముడతలు పడకుండా చూస్తాయి. శరీరాన్ని రిలాక్స్ చేస్తుంది: ఆందోళన, డిప్రెషన్, నిద్రలేమితో బాధపడుతున్న వారు క్రమం తప్పకుండా రాగులు తీసుకుంటే మంచి ఫలితం ఉంటుందని మెడ్ ఇండియా 2000లో నిర్వహించిన అధ్యయనం పేర్కొంది. గ్లూటెన్ ఉండదు: గోధుమలతో పోలిస్తే రాగులు చాలా సులభంగా జీర్ణమవుతాయి. ఇందులో గ్లూటెన్ ఉండదు. ఇది శరీరంలో మరింత ఆల్కలీన్ మీడియంను సృష్టిస్తుంది.


రాగి జావ తయారీ విధానం: ౹ి రాగి పిండిని ముందుగా కొన్ని నీళ్లలో వేసి ఉండలు లేకుండా కలుపుకోవాలి. ౹ి మరో గిన్నె తీసుకుని అందులో నీళ్లు పోసి స్టవ్ పై పెట్టుకోవాలి. ౹ి నీళ్లు మరిగేటప్పుడు ముందుగా నీటిలో ఉండలు లేకుండా కలిపి పెట్టుకున్న రాగి పిండిని ఈ నీటిలో వేసుకోవాలి. ౹ి తగినంత ఉప్పు, తగినంత మజ్జిగ వేసుకోవాలి. ౹ి ఆ మిశ్రమం దగ్గరికి వచ్చేంత వరకు కలుపుతూ ఉండాలి. ౹ి తర్వాత స్టవ్ పై నుండి దించి చల్లార్చుకోవాలి. ౹ి కొత్తిమీర, పుదీనా వేసుకుంటే రాగి జావ సిద్ధమైనట్లే. ౹ి కొద్దిగా కారంగా కావాలనుకుంటే కారం వేసుకుని రాగి జావను తాగొచ్చు.

# వడదెబ్బ తగిలిన వెంటనే చేయాల్సిన ప్రథమ చికిత్స ఇదే

అధిక వేడిని శరీరం తట్టుకోలేక వడదెబ్బ బారిన పడుతుంది. శరీరంలో ఎలక్ట్రోలైట్స్ తగ్గి, డీహైడ్రేషన్ బారిన పడడం వల్ల వడదెబ్బ కలుగుతుంది. బయట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నప్పుడు శరీరం తనలోని వేడిని నియంత్రించుకోలేక విఫలమవుతుంది. అలాంటి సమయంలోనే వడదెబ్బలాంటి ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడతాయి. వెంటనే ప్రథమ చికిత్స చేస్తే వారిని ప్రాణాపాయ పరిస్థితి నుంచి కాపాడుకోవచ్చు.

వడదెబ్బ లక్షణాలు
వడదెబ్బ తగిలిన వెంటనే శరీర ఉష్ణోగ్రత పెరిగిపోతుంది. ఒక్కోసారి 104ఛీ ఫారెన్ హీట్ దాటుతుంది. అపస్మారక స్థితిలోకి చేరుకుంటారు. గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస వేగంగా లేదా తక్కువగా తీసుకోవడ, రక్తపోటు పెరగడం లేదా తగ్గడం, చెమట పట్టకపోవడం, వికారం, వాంతులు కావడం, స్పృహ కోల్పోవడం వంటివన్నీ జరుగుతాయి. వడదెబ్బ తగిలిన వెంటనే ప్రాథమిక చికిత్సను అందిస్తే వారిని కాపాడుకోవచ్చు.

ప్రథమ చికిత్స ఇలా...
వడదెబ్బ తగిలిన రోగిని చల్లని నీటిలో ముంచిన వస్త్రంతో తుడవాలి. అలా శరీరం అంతా తుడుస్తూ ఉండడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గుతూ ఉంటుంది. శరీర ఉష్ణోగ్రత 101 డిగ్రీలు వచ్చే వరకు అలా చల్లని నీటితో వస్త్రంతో తుడుస్తూ ఉండాలి. చల్లని పానీయాలను అందించాలి. ఎటువంటి మందులు ఇవ్వకూడదు. గాలి తగిలేచోట ఉంచాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా గ్లూకోజ్ వాటర్ లో కాస్త ఉప్పు కలిపి తాగించడం మంచిది. ఓఆర్ఎస్ అందుబాటులో ఉంటే దాన్ని తాగిస్తే ఎంతో మేలు. ఈ పనులు చేస్తూనే మరోపక్క ఆసుపత్రికి తీసుకెళ్లే ఏర్పాట్లు కూడా చేయాలి. ఎందుకంటే కొంతమందిలో వడదెబ్బ తీవ్రంగా కొడితే ప్రాణానికే ప్రమాదం కావచ్చు.




ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?
ఎండలు పెరిగిపోతున్న ఈ కాలంలో వడదెబ్బ కొట్టకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. బయట ఉష్ణోగ్రత అధికంగా ఉన్న సమయంలో ఎక్కువసేపు ఎండకు గురవ్వకపోవడమే మంచిది. బయటికి వెళ్లే ముందు చల్లని పానీయాలు తాగి వెళ్లాలి. కాఫీ, టీలకు దూరంగా ఉండాలి. మద్యాన్ని పూర్తిగా మానేయాలి. లేత రంగులో ఉండే వస్త్రాలు ధరించాలి. అవి వదులుగా ఉండేలా చూసుకోవాలి. ఎండలో బయటికి వెళ్లినప్పుడు వాటర్ బాటిల్ దగ్గర ఉంచుకోవడం అన్ని విధాలా మంచిది.

ఎండలు పెరుగుతున్నప్పటినుంచి రోజూ మజ్జిగ తాగడం అలవాటు చేసుకోవాలి. వడదెబ్బను తట్టుకునే శక్తిని పానీయాలు అందిస్తాయి. చల్లని పానీయాలు, మజ్జిగ తాగడం వల్ల శరీరంలో ఎలక్ట్రోలైట్స్ పడిపోకుండా ఉంటాయి. వేసవిలో ఆహారపు అలవాట్లను కూడా మార్చుకోవడం మంచిది. దాహాన్ని పెంచేసే మాంసాహారాన్ని, మసాలా నిండిన ఫుడ్‌కు, స్పైసీ ఫుడ్‌కు దూరంగా ఉండటం మంచిది.

# 250 ఏళ్ల కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రీలీల.. రెమ్యునరేషన్ ఎన్ని కోట్లంటే?





కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మైసూర్ శాండల్ సోప్‌కు స్టార్ హీరోయిన్ తమన్నా భాటియాను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంపై కన్నడ సీమ రగిలిపోతోన్న సంగతి తెలిసిందే. దాదాపు 6.2 కోట్ల పారితోషికంతో తమన్నాకు ఈ బాధ్యతను కట్టబెట్టింది సిద్ధరామయ్య ప్రభుత్వం. అయితే కర్ణాటకలో ఎంతో మంది ప్రముఖులు, ప్రతిభావంతులు ఉండగా పరాయి రాష్ట్రానికి చెందిన నటిని మైసూర్ శాండల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం వివాదానికి దారి తీసింది. కర్ణాటక సంఘాలు, పార్టీలు, ప్రముఖులు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో కర్ణాటకకి చెందిన యువ కథానాయిక శ్రీలీల అదిరిపోయే ఆఫర్ అందుకున్నారు. ఈ వివరాల్లోకి వెళితే..

చేతినిండా సినిమాలతో శ్రీలీల బిజీ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీగా ఉన్న హీరోయిన్ ఎవరంటే ఖచ్చితంగా వినిపించే పేరు శ్రీలీల. ధమాకాతో లైమ్ లైట్‌లోకి వచ్చిన ఈ ముద్దుగుమ్మ ఆ తర్వాత భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. ఇక పుష్ప 2లో కిస్సిక్ సాంగ్‌తో దేశాన్ని ఊపేసి నేషనల్ వైడ్ పాపులర్ అయ్యింది. అందం, అభినయం, డ్యాన్స్‌తో క్రేజీ ఆఫర్లు పట్టేస్తోంది. చాలా చిన్న వయసులోనే బాలీవుడ్ ఆఫర్ కూడా అందుకోవడంతో శ్రీలీల అదృష్టంపై సీనియర్ హీరోయిన్లు, అప్ కమింగ్ హీరోయిన్లు అసూయ పడుతున్నారు. ఏళ్లుగా నిరీక్షిస్తున్న తమ వల్ల కానిది శ్రీలీల ఈజీగా సాధిస్తోందని కుళ్లుకుంటున్నారు.

ఆషికి 3తో బాలీవుడ్‌లోకి బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఆషికి 3 అనే సినిమా ద్వారా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు శ్రీలీల. అనురాగ్ బసు ఈ చిత్రానికి దర్శకుడు. దీపావళి కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. దీనిలో భాగంగా శరవేగంగా సినిమాను పరుగులు పెట్టిస్తున్నాడు అనురాగ్. అయితే అషికి 3 ఇంకా సెట్స్ మీద ఉండగానే శ్రీలీల హిందీలో మరో ఆఫర్ అందుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరో స్టార్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా సరసన శ్రీలీల ఆడిపడనుందట. ఆనంద్ ఎల్ రాయ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. రాజ్ సాండియాలా దర్శకత్వం వహిస్తారని బీటౌన్ టాక్. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇక తెలుగులో జూనియర్, మాస్ జాతర, లెనిన్, తమిళంలో పరాశక్తి సినిమాలలో శ్రీలీల నటిస్తున్నారు.

టాప్ బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా సినిమా హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇక బ్రాండ్ అండార్స్‌మెంట్స్‌తోనూ ఈ ముద్దుగుమ్మ భారీగా సంపాదిస్తోందట. న్యాడ్ స్కిన్ కేర్, అమృత గ్రూప్, ప్రెస్టా వుమెన్స్ వేర్, నీరూస్ తదితర బ్రాండ్స్‌కు శ్రీలీల అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా శ్రీలీల అండార్స్‌మెంట్స్ కెరీర్‌లోనే మైల్ స్టోన్ అనదగ్గ ఆఫర్ వచ్చింది.

శ్రీలీలతో యూకే కంపెనీ డీల్ పర్సనల్ కేర్, కాస్మోటిక్స్, ఫ్రాగ్‌రెన్స్ విభాగంలో ప్రపంచంలోని అగ్రగామి సంస్థల్లో ఒకటైన యార్డ్లే లండన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీకి దాదాపు 255 ఏళ్ల చరిత్ర ఉండగా.. ప్రపంచంలోని అత్యంత పురాతన కంపెనీల్లో ఒకటిగా యార్డ్లేకు పేరుంది. 2009లో యార్డ్లేను భారత కార్పోరేట్ దిగ్గజం విప్రో ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ సంస్థలోని ఫ్రాగ్‌రెన్స్ విభాగానికి గాను భారత్‌లో శ్రీలీల ప్రమోట్ చేయనుండటం విశేషం.

పారితోషికం ఎంతంటే? అయితే ఇందుకు గాను శ్రీలీల ఎంత మొత్తంలో పారితోషికం అందుకుంటున్నారన్నది తెలియరాలేదు. ప్రస్తుతం బ్రాండ్ ప్రమోషనింగ్ కోసం రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య శ్రీలీల ఛార్జ్ చేస్తుండటంతో ఇది కూడా అదే స్థాయిలో లేదా ఆపైనా ఉండే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యార్డ్లే నుంచి శ్రీలీల పారితోషికంగా ఎంత మొత్తం వసూలు చేస్తున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.




# చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవింద్‌నే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..

ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేరువైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.


అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచింది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యురిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు.పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# మహేష్ బాబు వదిలేసిన 1800 కోట్ల సినిమా.. థియేటర్లు బద్దలయ్యేవి.. ఆ మూవీ ఏంటంటే?





సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం ఇండియాస్ బిగ్గెస్ట్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ లోనే మూడవ షెడ్యూల్ జరుగుతోంది. చిత్రీకరణ విషయంలో మాత్రం జక్కన్న ఎస్. ఎస్. ఎం.బి 29 సినిమాను శరవేగంగా కొనసాగిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. మలయాళం సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే మహేష్ బాబు చివరిగా గుంటూరు కారం చిత్రంతో ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. అది సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పటివరకు రెగ్యులర్ క్యారెక్టర్లలోనే నటిస్తూ వచ్చారు. కానీ అభిమానులు మాత్రం ఆయనను పవర్ఫుల్ రోల్స్ లో చూడాలని ఎంతగానో ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే మహేష్ బాబు వదిలేసుకున్న 1870 కోట్ల సినిమా గురించి తాజాగా న్యూస్ బయటకు వచ్చింది. ఆ సినిమా చేసి ఉంటే మాత్రం మహేష్ బాబు ఇండియా ను షేక్ చేసే వారిని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

ఇంతకీ ఆ సినిమా ఏంటో తెలిస్తే అందరూ షాక్ అవ్వాల్సిందే. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్లో వచ్చిన పుష్ప చిత్రమే కావడం విశేషం. అయితే ఈ సినిమాకు మొదట హీరోగా మహేష్ బాబు అని అనుకున్నట్టుగా ఇప్పుడు తెలుస్తోంది. కానీ మహేష్ బాబు ఆ సినిమాలు వదులుకోవడంతో అల్లు అర్జున్ వద్దకు వెళ్లిందని ఫిల్మ్ సర్కిల్స్ లో గుసగుసలు నడుస్తున్నాయి. ఇక అల్లు అర్జున్ టెర్రిఫిక్ పెర్ఫార్మెన్స్ తో పుష్ప, పుష్ప 2 చిత్రాలు ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేశాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

రీసెంట్ గా వచ్చిన పుష్ప 2 చిత్రం ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. 1870 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసి ఇండియాలోనే హైయెస్ట్ గ్రాస్ కలెక్ట్ చేసిన రెండవ సినిమాగా రికార్డు సెట్ చేసింది. బాహుబలి 2 సాధించిన బాక్సాఫీస్ కలెక్షన్లు 1810 కోట్లను దాటేసి మరి ఈ రికార్డును సెట్ చేయడం సెన్సేషన్ గా మారింది. మన వైపు అల్లు అర్జున్ కు పుష్ప పాత్రలో నటించినందుకు ఏకంగా బెస్ట్ యాక్టర్ విభాగంలో నేషనల్ అవార్డు వరించిన సంగతి తెలిసిందే. ఇక నెక్స్ట్ పుష్ప 3 కూడా రాబోతుంది. ఆ పార్ట్ లో విజయ్ దేవరకొండ నటిస్తారని తెలుస్తోంది.

అయితే ఇంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిన పుష్ప చిత్రాన్ని మహేష్ బాబు ఎందుకు వదులుకున్నారా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ క్వశ్చన్ గా మారింది. అయితే పుష్ప చిత్రం ప్రారంభానికి ముందు మహేష్ బాబు ఇంట్లో వరుసగా విషాదాలు నెలకొనడం, గుంటూరు కారం చిత్రం తర్వాత ఎస్ఎస్ రాజమౌళి తో సినిమాకు కమిట్ అవ్వడమే కారణం అని తెలుస్తుంది. ఇక పుష్ప చిత్రమే కాదు, శంభాజీ మహారాజ్ జీవిత కథతో వచ్చిన చావా చిత్రాన్ని కూడా మహేష్ బాబు వదిలేసారంట. ఈ హిస్టారికల్ ఫిలిం లో మహేష్ బాబు నటించిన మాత్రం మరింత బీభత్సం సృష్టించే వారిని ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. ఇలా తన ముందుకు వచ్చిన రెండు బ్లాక్ బస్టర్ మూవీస్ ను మహేష్ బాబు వదులుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎస్. ఎస్. ఎం.బి 29 తో మాత్రం ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను చెల్లాచెదురు చేస్తారని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఆ ప్రాజెక్టుకు మార్కెట్లోనూ భారీ డిమాండ్ ఉండింది.

# భైరవం మూవీ రివ్యూ అండ్ రేటింగ్

వీపురంలో జమీందార్ వంశానికి చెందిన గజపతి (మనోజ్ మంచు)కి గ్రామంలో పేరు ప్రతిష్టలు ఉన్నప్పటికీ.. పేదరికం వెంటాడుతుంటుంది. గజపతికి తన ఊరిలోనే పెద్దరికాన్ని ప్రదర్శించే వరద (నారా రోహిత్), అనాథగా బతికే శ్రీను (బెల్లంకొండ శ్రీను) ప్రాణస్నేహితులుగా ఉంటారు. ఇదిలా ఉండగా, ఆ గ్రామంలోని ఆలయ ధర్మకర్తగా గజపతి నానమ్మ (జయసుధ) ఉంటారు. ఆలయ భూములు కాజేయడానికి మంత్రి (శరత్ లోహితస్య) పన్నాగం పన్నుతాడు.

అనాథ అయినప్పటికీ శ్రీనును కన్నబిడ్డగా ప్రజలు ఎందుకు చూస్తారు? శ్రీనుతో వెన్నెల (అదితి శంకర) లవ్ ట్రాక్ ఎలా సాగింది? గజపతిని భార్య నీలిమ (ఆనంది) ఎలా వేధించింది. భార్య ఒత్తిళ్లకు గజపతి తన మనసును ఎలా మార్చుకొన్నాడు. ప్రాణస్నేహితులుగా ఉండే గజపతి, వరద, శ్రీను మధ్య మంత్రి ఎలా చిచ్చు పెట్టారు. వరద స్నేహం కోసం ప్రాణాలిచ్చేంత ప్రేమ ఉన్న గజపతి తన స్నేహితులకు ఎందుకు ఎదురు తిరిగాడు? వరద, గజపతి, శ్రీను మధ్య విభేదాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయి? అనే ప్రశ్నలకు సమాధానమే భైరవం సినిమా కథ.

పోలీస్ ఇన్స్‌పెక్టర్ (సంపత్ రాజ్) తన ఉద్యోగానికి రాజీనామాను పై అధికారికి సమర్పించడంతో సినిమా హై నోట్‌లో మొదలవుతుంది. తన రాజీనామాకు కారణం చెప్పడం మొదలు పెట్టడంతో దేవీపురంలో ముగ్గురు ప్రాణ స్నేహితుల కథను ఎమోషనల్‌గా దర్శకుడు ప్రారంభించాడు. ముగ్గురు హీరోల ఇంట్రడక్షన్, ఎలివేషన్స్‌ను బాగానే డిజైన్ చేశాడు. ఆ తర్వాత శ్రీను ప్రేమ కథ, వరద, గజపతి ఫ్యామిలీ మధ్య ఉండే అన్యోన్యతను, కథను ఎస్టాబ్లిష్ చేయడానికి కాస్త టైమ్ ఎక్కువగా తీసుకొన్నట్టు అనిపిస్తుంది. ఫస్టాఫ్‌ను రెగ్యులర్, రొటీన్ ఫార్మాట్‌తో నడిపించినప్పటికీ.. ఇంటర్వెల్ ముందు పవర్‌ఫుల్ ఎపిసోడ్‌తో తొలిభాగాన్ని ముగించి సెకండాఫ్‌పై ఆసక్తిని పెంచాడు.

అయితే ముగ్గురు హీరోల మధ్య ఎమోషన్స్, బాండింగ్‌ను బలంగా ఎస్టాబ్లిష్ చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా ప్రయత్నం సరిగా చేయలేదనే ఫీలింగ్ కలుగుతుంది. భావోద్వేగంతో చెప్పాల్సిన సన్నివేశాల్లో యాక్షన్ నింపడం వల్ల సినిమాలో సోల్ కాస్త మిస్ అయిందనిపిస్తుంది. ఇలాంటి లోపాలు ఉన్నప్పటికీ.. మామిడితోట సీన్ నుంచి మూవీలో సన్నివేశాలు నెక్స్ట్ రేంజ్‌లోకి వెళ్తాయి. క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించిన తీరు విజయ్ కనకమేడల ప్రతిభ ఎంతో తెలుస్తుంది. సెకండాఫ్‌ను ఇంకాస్త బెటర్‌గా డిజైన్ చేయాల్సిందనే ఫీలింగ్ కలుగుతుంది. నటీనటుల ఫెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. బెల్లంకొండ శ్రీనివాస్ ఈ సినిమాకు బ్యాక్ బోన్‌గా నిలిచాడు. సినిమాలోని ఎమోషనల్ కంటెంట్‌ను తన పాత్ర ద్వారా బాగా ఎలివేట్ చేశాడు. నటుడిగా మరింత మెచ్యురిటీని చూపించాడు. ప్రీ క్లైమాక్స్ నుంచి క్లైమాక్స్ సన్నివేశాల్లో తనలోని నట విశ్వరూపాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. నారా రోహిత్, మనోజ్‌తో పాత్రలతో మమేకమై మంచి బాండింగ్‌ను ఆన్ స్క్రీన్‌పై ఎలివేట్ చేశాడు. ఇక మనోజ్ మంచు నటుడిగా మరో రేంజ్ పెర్ఫార్మెన్స్ చేశాడు. కాస్త విరామం తీసుకొన్నప్పటికీ.. సూపర్ క్యారెక్టర్‌తో రీ ఎంట్రీతో అదరగొట్టాడు. ఇండస్ట్రీలో తన టైమ్ స్టార్ట్ అయిందని గజపతి పాత్ర ద్వారా చాటి చెప్పాడు. నారా రోహిత్ విషయానికి వస్తే.. వరద పాత్రలో హుందాగా కనిపించాడు. తన పాత్రకు ఎంత ఎమోషన్ కావాలి? ఎంత యాక్షన్ కావాలో అంతే సమతుల్యాన్ని పాటించి సటిల్‌గా స్క్రీన్ పై కనిపించాడు. ఇక నాన్నమ్మగా జయసుధ పాత్ర అంతంత మాత్రమేగానే ఉన్నప్పటికీ.. స్క్రీన్ మీద కనిపించినంత సేపు ఆమె ప్రజెన్స్ బాగుంది. ఈ సినిమా కథను నడిపించే పాత్రలో నీలిమగా ఆనంది నటన బాగుంది. కేవలం గ్లామర్ పరంగానే కాకుండా ఆనంది పాత్రల స్వరూపాన్ని, సినిమా కథ దిశను మార్చే పాత్రలో ఒదిగిపోయింది. ఇక నారా రోహిత్ భార్య పాత్రలో పూర్ణిమగా దివ్య పిళ్లై ఎమోషనల్ కంటెంట్‌ను సినిమాకు అందించే విధంగా పెర్ఫార్మ్ చేశారు. వెన్నెల కిషోర్ కామెడీ పెద్దగా వర్క్ కాలేదు. సంపత్ రాజ్, శరత్, అజయ్, ఇతర పాత్రలు సినిమాలో గుర్తుంచుకొనే పాత్రల్లో కనిపించారు.

టెక్నికల్ అంశాల విషయానికి వస్తే.. ఈ సినిమాకు శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ప్రధానమైన బలంగా మారింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తోనే కాకుండా హీరోల ఇంట్రడక్షన్ సాంగ్ సంక్రాంతి పాట, అలాగే వెన్నెల, గిచ్చు గిచ్చు సాంగ్ ఆడియో పరంగా ఫుల్ జోష్‌ను కలిగిస్తే.. తెర మీద అదే జోష్‌ను చూపించారు. ఇక ఈ సినిమాలో మంచి మాస్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయి. వాటితో గ్రామంలోని వాతవరణాన్ని హరి కె వేదాంతం చక్కగా, చాలా సహజంగా చిత్రీకరించాడు. కేకే రాధామోహన్ ఈ మూవీని రాజీ లేకుండా మంచి క్వాలిటీతో సినిమాను అందించారు. ప్రొడక్షన్ వాల్యూస్ హై స్టాండర్డ్‌లో ఉన్నాయి. కంటెంట్‌పై మరింత దృష్టిపెట్టి ఉంటే బెస్ట్ మాస్ యాక్షన్ మూవీ అయి ఉండేదనిపిస్తుంది. తమిళంలో సూపర్ హిట్ అయిన గరుడన్ సినిమాకు భైరవం రీమేక్. ఈ సినిమాలో అన్ని రకాలు ఎమోషన్స్ ఉంటాయి. కొన్ని చోట్ల భావోద్వేగాలు లోపించాయి. యాక్షన్ పార్ట్ సినిమా ఫ్లేవర్‌ను మార్చేసింది. పాటల బాగున్నప్పటికీ వాటి ప్లేస్‌మెంట్ సరిగా లేకపోవడం వల్ల మంచి ఫ్లోలో వెలుతున్న స్టోరికి బ్రేకులు వేశాయా? అనిపిస్తుంది. ఈ సినిమా పక్కా మాస్ ఎంటర్‌టైనర్. బెల్లంకొండ శ్రీను, నారా రోహిత్, మనోజ్ మంచు ఫెర్ఫార్మెన్స్ ఈ సినిమాకు హైలెట్. కథ పరంగా పాత కథే.. కాకపోతే డిఫరెంట్‌గా చేయాలన్న ప్రయత్నం కొంత ట్రాక్ తప్పింది. టోటల్‌గా ఈ సినిమాను థియేటర్‌లో ఓసారి చూసేయొచ్చు అనేది నా అభిప్రాయం.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com